కథానిక

# డేంజర్ సిగ్నల్

కె. జి. ఆచార్య

నీ రెండు జాబులూ చేరాయి. గునుస్తూ గువగువలాడుతూ వచ్చేసి, వొళ్ళో వాలిపోయిన రెండు గువ్వల్లాగనే ఉన్నాయ్.

ఏమిటీ? యీ ఒక్క ఆరురోజులకే అంత ఆగాటమూ, ఆత్రుతానా? ఆరురోజులూ ఆరు నెలల్లాగ, సంవత్సరాల్లాగ, యుగాల్లాగ వున్నా యంటున్నావా? ఎందుకూ అంత బేలగా వ్రాశావ్? ఆ చల్లని బెంగుళూరు వాతావరణంలో యీ ఆరురోజుల్లోకే యిలాంటి వేడి వేడి గాడ్పులు నీకు తగిలాయా? నీ వాక్యాలు చదువుతూంటే నిజంగా నాకు నవ్వే వస్తోంది.

లాల్ బాగ్ బాగుండలేదు- ఏం? అక్కడి కమ్మని చలిగాలులు చక్కని శాంతి నిస్తాయే. నీ ఆరోగ్యాన్ని చక్క బరుస్తాయే. ఇంకా ఆ హాయినిచ్చే వాతావరణంలో కూడా యింట్లో పప్పు లున్నాయా, ఉప్పు లున్నాయా- అని అనుకుంటున్నావా? నాకు తెలుసు, నువ్వ వొత్తి బేలవి. ఇవన్నీ మరిచిపోయి ఆ చల్లని వాతావరణంలో చక్కగా విశ్రాంతి తీసుకుంటే గాని లాభం లేదు.

నీ వాక్యాలు చదివాను; నీ బాధని అర్థం చేసుకున్నాను. గడిచిన రెండేళ్లలో ఏ ఒక్క రోజూ నేను లేకుండా గడపని దానివి, ఇప్పుడు యిలా యింతదూరంలో గడపడం - నిజంగా బాధాకరమే. అయితే నీ ఆరోగ్యం? డాక్టరు బాబయ్య చెప్పినమాట వినాలా లేదా?

నామాట విని, ఒక్క నెల రోజులపాటు అయినా అక్కడ వుండు. అక్కగారి పాపాయిల్ని వెంటబెట్టుకొని, షికారుగా వెళ్తూ వుండు. నిజంగా, ఆ కళ్యపుడూ, వసంతా పువ్వుల్లాంటి నవ్వుల్ని యిస్తారు. ఆ పసిపాపల లేత హృదయాల్లోని నైర్మల్యం మనకి ఎంతో హాయి నిస్తుంది.

పకాలున నవ్వుకున్నాను నీ వుత్తరం చూసి. ఆ బెంగుళూరు వాతావరణంలో అన్నీ మరిచి పోదామని వుంటుంది గదా, అసలు అన్నీ మరుపుకే వస్తాయి గదా- నువ్వేమిటి, యింత అశాంతిగా అన్నీ ఏకరువు పెట్టున్నావ్?

ఏమీ తోచడంలేదా? అబ్బ, ఎన్నిసార్లు వ్రాశావ్ ఆమాట.

నాకేగనక నీకు చిక్కిన అవకాశం చిక్కి వుంటేనా, కనీసం ఒక్క నెల రోజులపాటు సెలవు దొరికి వుంటేనా, ఆ బెంగుళూరి చల్లదనాన్ని అంతా అలా మింగేసి వుండేవాణ్ణి. కళ్యపుణ్ణీ, వసంతనీ వెంటవేసుకొని, ఆ లాల్ బాగ్‌నూ, ఆ కబ్బన్ పార్కునూ చుట్టి వచ్చేవాణ్ణి. ఆ పాపల్తో ఆడుకుంటూంటే, వాళ్ళ నవ్వుల పువ్వుల్ని ఏరుకుంటూంటే, తక్కిన లోకం అంతా ఎందుకు జ్ఞాపకం వొస్తుంది.

నిజంగా చిట్టి చిట్టి పాపాయిలు వున్న చోటనే స్వర్గం వున్న దనుకో. వాళ్ళ ఆల్లారు ముద్దుపలుకుల్లోనే, ఆటపాటల్లోనే అమృతం వుందనుకో. బెంగుళూరు లాంటి వాతావరణంలో వేరే చెప్పాలా?

కళ్యపుడికీ, వసంతకీ చలి చొక్కాలంటే ఇష్టంగదూ? అవి తొడిగి ముస్తాబుచేసి, చక్కగా షికారు తీసుకు వెళ్తూండు. నువ్వూ అలాగే అన్నీ మరిచి పోయి, వాళ్లతో ఆడుతూ పాడుతూ గడుపు.

ఊబుసు పోయేటందుకు, ఏమైనా కొత్తకొత్త సంగతులు వ్రాయమన్నావు. ఈ ఆడివి వూళ్లో ఏం కొత్త సంగతు లుంటాయ్?

నీ ఆరోగ్యం జాగ్రత. ఆ టానిక్ పుచ్చుకుంటున్నావా?

* * *

నీ ఉత్తరం నిజంగా యీ సారి నాకెంత ఆనందాన్ని యిచ్చింది. అలాగే, కొంత -

బలవంతంగానే - అవకాశం కలుగజేసుకుంటూ వుండాలి, విశ్రాంతి కోసం.

కళ్యాపుడు రోజూ లాల్‌బాగ్‌కు తీసుకువెళ్ళమని మారాం పెడ్తున్నాడా? వాణ్ణి బట్టి, వసంతకూడా అడుగుతున్నదా? వాళ్ళిద్దర్ని బట్టి అయినా, నువ్వు వెళ్తున్నావు. ఆదీ కొంత మేలే. వసంత చీరలు కట్టమని ఏడుస్తోందా? అది పట్టిన పట్టు వొదలదు. కాని అమాయకపు పిల్ల

ఇక్కడున్న కొద్దిరోజులూ ఆ పాపలిద్దరూ నాదగ్గిర బహు చేరిక అయిపోయారు. ఆ ఉన్న న్నాళ్లూ ఏదో మాయగా వుండేది.

మొన్న పట్నంలో బీచికి వెళ్ళినప్పుడు తేంగాయి మాంగాయి బటానీ సుండాల్ చూశాక, వసంత జ్ఞాపకం వచ్చింది. అల్మారాలో బిస్కట్ల పొట్లాం కనిపించేసరికి, కళ్యాపుడి కేరింతాలు జ్ఞాపకం వచ్చాయి. రాత్రి నిద్దరే వచ్చింది కాదు.

నిన్న సాయంత్రం ఐదున్నరకే స్టేషన్‌నుంచి వచ్చేశాను. ఏమీ తోచక గుబులు గుబులుగా వుంటే, అలా ఓవర్‌బ్రిడ్జి దాటి ఆ మిలటరీ క్వార్టర్సు వేపు వెళ్లాను... వాటి పక్కనుంచి పరధ్యానంగా వెళుతూంటే, కళ్యాపుడిలాగే వున్నాడు- నాలుగేళ్ళ పిల్లాడొకడు- రోడ్డుకి అడ్డంగా పరుగెత్తుతూ దభాలున పడ్డాడు. బావురుమన్నాడు.

చటుక్కున వెళ్ళి ఎత్తాను. ఒళ్లు దులువుతూ, దగ్గిరికి తీసుకున్నాను. ఎంత ముద్దొస్తున్నాడనుకున్నావ్? సిక్కుల పిల్లాడు- చిన్న షేర్వాణీ, జుబ్బా; ఎర్రని శరీరానికి తగ్గట్టుగా ఎర్రని రాగిజుట్టు; చురుకుగా వున్న పులికళ్లూ, కళ్ళ చుట్టూ సుర్మా.

అంత బావురుమన్నవాడూ, నేనలా ఎత్తుకొని కాస్త బుజ్జగించేసరికి, పకాలుమన్నాడు. మోచేయి, మోకాలు, కొంచెం గీసుకుపోయాయి. అయినా లెక్కచేయలేదు. నా చేతుల్లోంచి గిరుక్కున తప్పించుకొని, తుర్రున పారిపోయాడు.

మళ్లీ ఒక్కక్షణంలో దగ్గిరసా వచ్చి, "షుక్రియా" అంటూ, నేతాజీ జయ్‌హింద్‌లాగ ఒక్క సెల్యూట్ కొట్టి చక్కాబోయాడు. గుమ్మంలో వాళ్ళ అమ్మగాబోలు వుంది. చూచి నవ్వుకుంది-అంతే!

నేను మెల్లగా వచ్చేశాను. కాని రాత్రంతా ఆ పిల్లవాని రూపం, ఆ 'షుక్రియా' పలుకు- నాలోనే వుండిపోయాయి. కళ్యాపుణ్ణీ, వసంతనీ- మరి కొద్దిరోజులపాటు యిక్కడ వుంచి వేయలేదేమా అని అనుకున్నాను. ఐనా వాళ్ళమ్మా నాన్నా వుంచుతారా?

* * *

నీ లేఖ అందుకున్నాను. అలాగ ఏమైనా, కబుర్ల వుత్తరాలు వ్రాస్తూంటే, కాస్త వుబుసుపోతూ వుంటుంది అంటావు. నీకు చాదస్తం గాని, యిక్కడి అడివి వాతావరణంలో విసిగెత్తి కదా, నీ ఆరోగ్యం అలా అయింది? ఆ ప్రశాంత వాతావరణంలో కూర్చొని మళ్ళీ యీ అశాంతి వాతావరణాన్ని గురించి వ్రాయమంటా వెందుకూ? పోనీలే అలాగే వ్రాస్తూంటాను. ఆ విధంగానైనా రెండు నెలలపాటు అక్కడ వుండి ఆరోగ్యాన్ని చేకూర్చుకో - కావలసిందదే కదా!

* * *

ఇందాకనే నీకో ఉత్తరం పోస్టుచేశాను. అయినా కబుర్ల వుత్తరం కావాలన్నావని కూర్చుని యింకో వుత్తరం వ్రాస్తున్నాను.

ఇవేళ సాయంత్రం ఆరుగంటలకి మళ్ళీ అటు షికారుగా వెళ్లాను. ఆ మిలిటరీ క్వార్టర్సు ముందు రోడ్డుకి ప్రక్కగా ఆడుకుంటున్నాడు ఆ సిక్కుల పిల్లాడు. ఎందుకో చెప్పలేను, దగ్గిరగా వెడుతూ చప్పట్లుకొట్టాను. ఒక్కసారి యిటు తిరిగి "కోన్‌హాయ్" అంటూనే చూసి "ఓ, షుక్రియా!" అన్నాడు.

ఎంత జ్ఞాపకం-ఆ మాటతో నే నాగలేక పోయాను. "షుక్రియాఁ, బేటా! షుక్రియాఁ" అంటూ అలా వెళ్ళి చప్పున ఎత్తుకున్నాను. హృదయానికి హత్తుకున్నాను, ముద్దు పెట్టుకున్నాను.

"అరే, గుల్‌షాబ్!" అంటూ లోపల్నించి వాళ్లఅమ్మ కాబోలు పిలిచింది. దింపి వెళ్లమని సైగచేశాను.

"ఊఁహూఁ" అన్నాడు. ఆ మాటకి మళ్లీ చప్పున ఎత్తుకున్నాను.

వాళ్లఅమ్మ మళ్లీ పిల్చినా, నా లాల్చీని పట్టుకొని వుండిపోయాడు. ఆఖరికి నేనే నవ్వుకుంటూ, ఆ గుమ్మంవరకూ తీసుకువెళ్లి దించాను.

ఆమె నన్ను చూసి నవ్వింది.

"వీధిలో వెళ్లే వాళ్లందర్నీ అలా పట్టుకు వెళ్లాడతారా?" అన్నట్టుగా, పంజాబీ భాషలో పిల్లాణ్ణి మందలించింది నవ్వుతోనే.

నేనూ ముసిముసిగా నవ్వుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాను.

అలాగే ఆ రోడ్డుమీదుగా చాలాదూరం నడిచి వెళ్లాను. మళ్లీ యిటుతిరిగి అడ్డదారి గుండా-ఆ ఓవరుబ్రిడ్జి మీదకు వచ్చేసరికి ఆ దిగువలో-తిరిగి ఆ సిక్కుల పిల్లాడూ, వాళ్ళ అమ్మా కనిపించారు. ఆమె కూర్చునివుంది - పిల్లాడు బెలూన్ వూదుకుంటూ పక్కనే ఆడుకుంటు వున్నాడు.

ఒక్కసారి అటే చూస్తో వుండిపోయాను. ఆమె చూసింది-

"ఏం, మళ్లీ వచ్చారు? మాగుల్‌షాబ్‌ని విడిచి వెళ్లలేక పోతున్నారా!" అని అడిగింది హిందుస్తానీలో.

ముసిముసి నవ్వులు నవ్వాను.

"షికారుగా తీసుకు వెళ్లమని వేధించుకు తింటున్నాడు. అందుకని యిలా తీసుకవచ్చాను. అబ్బ! చెడ్డ అల్లరి పిల్లవాడండి. మీకు యిచ్చేస్తా తీసుకుపొండి!" అంది నవ్వుతూ, హిందుస్తానీలో.

"అచ్ఛా, దీజియేగా! ఇస్‌సే బఢ్‌కర్ కౌన్‌సా భాగ్యహై!" అన్నాను చేతులు సాపిస్తూ.

అప్పటికి, నాకు హిందుస్తానీ వచ్చునని తెలుసుకుంది గాబోలు. ఆనందంగా-ఆశ్చర్యంగా-చూస్తో, యింకా ఏమో అడగా లన్నట్టుగా, ఏమో చెప్పాలన్నట్టుగా నవరించుకుంది.

నేను కొంచెం ముందుకు వెళ్లి గుల్‌షాబ్‌ని చేతుల్లోకి తీసుకున్నాను.

"అయితే, గుల్‌షాబ్ కాందిశీకుల పిల్లాడే!" అంది.

చూడ్డానికి ఎంతో అందంగా, అదృష్ట శాలినిగా కనిపిస్తోన్న ఆమె కాందిశీకురాలా? అనుకుని ఆశ్చర్య పోయాను.

"మరి మిలటరీ క్వార్టర్సులో వున్నారేం?" అని వెంటనే అడగకుండా వుండలేక పోయాను.

ఇక చెప్పింది తన కథ. తన దూరపు బంధువొకాయన యిక్కడ మిలటరీ బేస్‌లో చిన్న ఆఫీసరుగా వున్నాడట. ఆయన ఆశ్రయంలోకి వచ్చేసిందట. ఆ మధ్య జరిగిన ఇండియా - పాకిస్తాన్ విభజన సందర్భంలో మతకలహాల ఫలితంగా - ఆమె తన భర్తను కోల్పోయింది; సర్వస్వం ధారబోసుకుంది. ఆఖరికి, యీ పసికందును రక్షించుకుంటూ, తన మానాన్ని కాపాడుకుంటూ యిలా యిక్కడికి చేరింది.

ఆమె వర్ణించిన ఆ ఘట్టాలన్నీ వింటూంటే హృదయం జలదరించి పోయింది. నిజంగా, నువ్వు గనుక ఆమె నోటినుంచే ఆకరుణ గాథ వింటే, తప్పక కన్నీరు పెట్టుకుంటావు.

ఇలాంటి దుస్థితికి వచ్చినందుకు ఆమె దుఃఖించడం లేదట. ఇక మిగిలివున్న ఆ ఒక్కగాని ఒక్క పిల్లాడికి ఏమి వస్తుందో అని దుఃఖిస్తున్నదట. ఆ వాత్సల్యం చూడు.

ఐతే, నే నేమీ సానుభూతి చూపలేక పోయాను. పిల్లాణ్ణి ఎత్తుకొని, ఒక్కసారి ముద్దు పెట్టుకొని "భగవాన్ భలా కరే!" అంటూ వచ్చేశాను. మరంతకన్నా ఏం చేయగలను!

* * *

మళ్లీ నిన్నటిలాగనే రాత్రి వేళ కూర్చొని, యీ వుత్తరం వ్రాస్తున్నాను. నిన్న వుత్తరం ఎలా వున్నది? కొత్త కబురు విన్నావా? దాని తర్వాత- వినిపిస్తున్నాను.

ఇవేళ ప్రొద్దుట తొమ్మిదీ తొమ్మిదిన్నరకే స్టేషనుకు వచ్చేశాను. పని అంతగా లేదు. వూరికే, అలా- ప్లాట్‌ఫారం చివరవరకూ వెళ్లి, ఏమిటో- పరధ్యానంగా యోచిస్తూ వుండిపోయాను.

"సాబ్!" అంటూ గుల్‌షాబ్ చటుక్కున లాల్చీ పట్టుకున్నాడు. కూరగాయలనుంచి పట్టుకొని వాళ్ళ అమ్మ అటువెళ్తూ చూసింది.

నా కెంతో ఆనందం అయింది. గుల్‌షాబ్‌ని దగ్గిరకి తీసుకున్నాను.

"ఇక్కడేనా మీ వుద్యోగం ? అయ్యో; రోజూ బజారుకి ఇటే వెళ్తూంటామే!" అంది.

ముద్దుగా గుల్‌షాబ్ నిగ్గులు తేరిన బుగ్గలు నిమిరాను. తరవాత యిద్దరూ వెళ్లిపోయారు.

ఆఫీస్‌లో పనిచేస్తున్నానన్న మాటేగాని, ఆ గుల్‌షాబ్ నా కళ్ళముందరే వున్నాడు.

పనిమూలంగా, చాలా ఆలస్యమే అయింది స్టేషనులో. ఏడు దాటిపోయింది. కొంచెం కొంచెం చీకటిపడుతూన్నది కూడా. వాళ్లు ఆ బ్రిడ్జివగ్గర వుంటారో వుండరో అని అనుకుంటూనే, అటు నడిచివెళ్ళాను. ఐతే, బ్రిడ్జికి ఇటు పక్క రాతిగట్టుమీద ఇద్దరూ కనిపించారు. గ్యాస్ బెలూన్ విడుస్తూ, కేరింతాలు కొడుతున్నాడు గుల్‌షాబ్. ఇవేళ-జవ్వార్ లాల్ చొక్కా, టోపీ తొడుకున్నందు మూలాన మరీ ముచ్చటగా వున్నాడు. గబ గబా వెళ్లి ఎత్తుకుని, బిస్కట్ల పొట్లాం యిచ్చాను. పచ్చగా వెలుగుతూన్న సిగ్నల్ లైట్‌ని చూపించాను. అప్పుడే వస్తోన్న బొంబాయి ఎక్స్‌ప్రెస్‌ని బ్రిడ్జి గోడమీదినించి చూపిస్తో, చేతు లూపించాను; కిలకిల్లాడించాను; కేరింతాలు కొట్టించాను. నిజంగా, ఆ వచ్చీరాని హిందుస్తానీ పలుకులు, ఆ చేష్టలు నన్నెంతో వెర్రెత్తించాయి.

కాని, వాళ్ళఅమ్మ యిక్కడికి వచ్చాక కూడా- అనుభవిస్తోన్న యమయాతల్ని వినేసరికి, నిజంగా నా కెక్కడలేని బాధా కలిగింది. ఒక విధంగా బంధువులుగదా అని ఆపత్కాలంలో తలదాచుకోడానికి వచ్చిన అభాగ్యతాల్ని, యీ మిలటరీ ఆఫీసరూ, ఆయనభార్యా- దాసీదానికన్నా హీనంగా చూస్తున్నారట. అంతా చెప్పుకొని ఏడుస్తోంది. వింటూంటే, నా హృదయం పగిలిపోయింది. మనింట్లోకి తీసుకు వచ్చేద్దామా అన్నంత ఆవేశం, జాలీ పుట్టుకు వచ్చాయి. అలాంటి అభాగ్యులికి సాయంచేయకపోతే, యింకెందుకు జీవితం! సరిగా ఆదరించే దిక్కు లేదు. ఇంకా చిన్న వయస్సులోనే వుంది. చిన్నప్పుడు వాళ్ళ నాన్న నేర్పించిన సంగీతం, కుట్టుపని భద్రంగా వున్నాయట. వాటితోనే బ్రతుకు తెరువు చూసుకో గలను అంది. కాని, అంతవరకూ ఎవరైనా పుణ్యాత్ములు వూతనిస్తే చా లంటున్నది. లేకపోతే, ఏదుర్మార్గుని దగాకో గురియై, మానాన్నీ ప్రాణాన్నీ కూడా పోగొట్టుకుంటుంది. ఇక ఆ గుల్‌షాబ్ ఏ కసాయివాడికో అయిపోతాడు. అబ్బ, తలుచుకుంటే వొళ్లు జలదరిస్తోంది.

ఆమె చెప్పినదంతా ఆమె కళ్ళలో మళ్లీ చూస్తో వుండిపోయాను. బ్రిడ్జికి పక్కగా ఎర్రగా కనిపిస్తోన్న సిగ్నల్‌లోని ఆ ఎర్రదనం ఏమిటో భయాన్ని కలిగించింది.

నా కేమీ తోచలేదు-నువ్వు దగ్గర వుంటే ఏం చెప్పేదానివో.

ఆమెకు ధైర్యంచెప్పి, గుల్‌షాబ్‌కు ఏమైనా కొని యివ్వవలసిందని- ఐదు రూపాయలు యిచ్చాను.

"నిజంగా మీరు పుణ్యాత్ముల్లాగ కనిపిస్తున్నారు. ఐతే నాకు కావలసింది డబ్బుగాదు- యింత ఆశ్రయం, హృదయం, జాలి..." అని అర్థించింది ఎంతో దీనంగా.

ఏమీ చెప్పలేక మెల్లగా- బరువుగా ఇంటికి వచ్చేశాను.

* * *

నీ వుత్తరం ఒక్కసారిగా ఆశ్చర్యంలో ముంచివేసింది. ఇవేళ మెయిల్లో బయలుదేరి వచ్చేస్తున్నావా ? నాకేమీ అర్థం గాలేదు. నా వుత్తరంలో డేంజర్ సిగ్నల్ కనిపించిందా? అంటే !

నీవు వ్రాసింది నిజమే అయితే, యీ వుత్తరం అందకముందే బయలుదేరతావు. అందుకని యిప్పుడే టెలిగ్రాం యిచ్చాను, రావద్దని. పైగా, యీ లెటరు మా ఎక్స్‌ప్రెస్ గార్డు చేతి కిచ్చి పంపిస్తున్నాను. ఇంటికే వచ్చి యిస్తాడు. బయలుదేరకుండా వుంటే, అంత తొందరపడి రావద్దు.

నీ వుత్తరమే నా కర్థం గాలేదు- ఏమిటా డేంజర్ సిగ్నల్ ?